క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

కవిటి: మండలంలోని బొరివంక సబ్‌స్టేషన్ పరిధిలో మాణిక్యపురం ఫీడర్‌లోని గ్రామాలు, ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్ సప్లయ్ స్కీములకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కవిటి ట్రాన్స్‌కో ఏఈ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎస్‌కేఈ రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ స్తంభాల మార్పిడి ప్రక్రియ చేపట్టనున్న నేపథ్యంలో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

లొంగిపోయిన నిందితుడు

కవిటి: మండలంలోని శిలగాం సమీపంలో జాతీయ రహదారిపై ఆయిల్ కంటైనర్‌లో గంజాయిని తరలిస్తూ 2020 సంవత్సరంలో పట్టుబడిన కేసులో ఒడిశాకు చెందిన పి.సేతుపతి అనే మరో వ్యక్తిని నిందితునిగా గుర్తించినట్లు కవిటి ఎస్‌ఐ కె.రాము తెలిపారు. నిందితుడు గురువారం స్వయంగా వచ్చి పోలీసుల ఎదుట లొంగిపోయినట్టు వెల్లడించారు.

ఓటీఎస్‌ను పూర్తి చేయండి

నందిగాం: మండలంలో ఇంకా పెండింగ్‌లో ఉన్న వన్ టైమ్ సెటిల్‌మెంట్ పథకాన్ని పూర్తి చేయాలని డీఎల్‌పీవో ఐబీ రమణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శివప్రసాద్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులతో సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని పంచాయతీల్లో పూర్తిస్థాయిలో ఓటీఎస్ పూర్తి చేయాలని, అలాగే జగనన్న సంపూర్ణ భూహక్కు రక్షణ పథకంపై అవగాహన కల్పించాలని సూచించారు.

'సద్వినియోగం చేసుకోవాలి'

టెక్కలి: ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.లక్ష్మీనారాయణ సూచించారు. గురువారం పట్టణంలోని కిసాన్ సమృద్ధి కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో జె.పరమేశ్వరరావు, సీహెచ్ లింగరాజు, డి.రాజ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

శివారుకు సాగునీరు



బంటుకొత్తూరు వద్ద వంశధార కాలువలో నీరు

పలాస: మండలంలోని శివారు కాలువకు వంశధార ఎడమ కాలువ నీరు గురువారం చేరింది. గత మూడు రోజులుగా భారీ వర్షాలు పడడంతో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది పలాస, వజ్రపుకొత్తూరు మండలాల శివారు భూములకు నీరు లభించే అవకాశం కనిపిస్తోంది. అలాగే ఈ కాలువ కింద ఉన్న చెరువులు కూడా జలకళ సంతరించుకున్నాయి. ఈ మేరకు పలాస ఏఈ పోలారావు మాట్లాడుతూ వర్షాలు తగ్గిన వెంటనే ఉభాలు వేయడానికి రైతులు సిద్ధమవుతున్నారని తెలియజేశారు. ఈ ఏడాది సకాలంలో నీరు వస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆలయానికి రూ.50 వేల విరాళం

కవిటి: స్థానిక బెహరావీధిలో వెలసిన జగన్నాథస్వామి ఆలయం పునర్నిర్మాణానికి బెజ్జిపుట్టుగకు చెందిన పొందల విజయకృష్ణ మిత్రబృందం, కవిటికి చెందిన ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ జగన్మిత్ర, స్వాగత్‌బాబులు రూ.50,000 విరాళం ప్రకటించారు. ఆలయ ఆవరణలో సర్పంచ్ పూడి లక్ష్మణరావు, మాజీ సర్పంచ్‌లు బెందాళం వెంకటేశ్వరరావు, ఆరంగి మధుబాబు సమక్షంలో విరాళాన్ని ఆలయ కమిటీకి గురువారం అందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు జన్ని లోకనాథం, పి.నీలాచలం, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

ఇచ్ఛాపురం: కవిటి మండలం శిలగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వైద్యుడు, కేజీహెచ్ ప్రొఫెసర్ డా.ఉలాల కోదండరాము రూ.25 వేలు విలువైన మైక్‌సెట్‌ని వితరణగా గురువారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, శిలగాం గ్రామ పెద్దలు మరిడి శ్రీనివాస్, రాము పాల్గొన్నారు.

పూర్వ ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం

సంతబొమ్మాళి: మండలంలోని యామలపేట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో పూర్వ ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈవోలు ఎం.చిన్నవాడు, అర్జున్‌రావు హాజరయ్యారు. పూర్వ ఉపాధ్యాయులు హిమగిరి, మన్మథరావు, అప్పలరాజు, దుర్గారావు, మహాలక్ష్మి, లక్ష్మీకుమారి, విజయ్ కుమార్‌లను యువకులు సన్మానించారు. అలాగే పాఠశాల అభివృద్ధిలో భాగంగా సైన్స్ మెటీరియల్ కోసం యువకులు సేకరించిన రూ. 20 వేల విరాళంను హెచ్‌ఎం విశ్వేశ్వరరావుకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు జగన్నాథరావు, స్కూల్ కమిటీ చైర్మన్ కూర్మనాయకులు తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ సమృద్ధి కేంద్రం ప్రారంభం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో గురువారం ప్రధానమంత్రి కిసాన్ కేంద్రంను ప్రారంభించారు. మధ్యవర్తులు లేకుండా రైతులకు కావాల్సిన ఎరువులు, పనిముట్లు సబ్సిడీ ధరల్లో లభించునని నిర్వాహకులు తెలిపారు.



సోంపేట: బారువలో ధ్రువపత్రాలు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ తదితరులు



కోటబొమ్మాళి: తిలారులో ధ్రువపత్రాలు అందజేస్తున్న దువ్వాడ వాణి



వజ్రపుకొత్తూరు రూరల్: రైస్ కార్డు అందజేస్తున్న నాయకులు, అధికారులు



వజ్రపుకొత్తూరు: రెయ్యిపాడులో ధ్రువపత్రాలు అందజేస్తున్న నాయకులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు
- జోరుగా 'జగనన్న సురక్ష'

మందస:

ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని సువర్ణాపురంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందనివారికి జగనన్న సురక్షలో సాంకేతిక అవరోధాలను తొలగించి, పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాలతో పేదరికం లేని రాష్ట్రాన్ని నిర్మించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ నాయకులంతా ప్రజలను ఏమార్చడానికి ప్రయత్నిస్తారని, ఎట్టి పరిస్థితుల్లో నమ్మవద్దని సూచించారు. అనంతరం గ్రామానికి చెందిన వలంటీర్ తెప్పల లక్ష్మి మాట్లాడుతూ.. గ్రామ వలంటీర్లపై పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. నిరంతరం శ్రమిస్తున్న వలంటీర్లపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఏదో స్క్రిప్ట్ రాసుకుని వచ్చి ఉపన్యాసాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, వైస్ ఎంపీపీలు సీర ప్రసాద్, కొర్నాని ఆదినారాయణ, మఖరజోల సర్పంచ్ బమ్మిడి ధర్మారావు, తహసీల్దార్ బడే పాపారావు, ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు, ఎంపీటీసీ గొరకల పార్వతి, బాలిగాం పీఏసీఎస్ చైర్మన్ సొర్ర ఢిల్లేశ్వరరావు, డాక్టర్ వైఎస్సార్ హెచ్‌యూ బోర్డు మెంబర్ బత్తిని లక్ష్మీనారాయణ, గొరకల కేశవరావు, జుత్తు శంకరరావు, బెలమర జీవన్, దున్న హరికృష్ణ పాల్గొన్నారు.



మందస: మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

నందిగాం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అన్నారు. మండల కేంద్రమైన నందిగాంలో సర్పంచ్ జడ్యాడ రమణమ్మ అధ్యక్షతన జేసీఎస్ కన్వీనర్ జడ్యాడ జయరాం ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మురళీకృష్ణ, ఎంపీడీవో శివప్రసాద్, తహసీల్దార్ పద్మావతి, కురమాన బాలకృష్ణరావు, కింతల ధర్మారావు, తమిరె ఫల్గుణరావు, అంబోడి విష్ణు, చిన్ని జోగారావు, కణితి నారాయణమూర్తి, పుష్యా సత్యం తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న సురక్ష కార్యక్రమంలో సమస్యల పరిష్కారం జరుగుతోందని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. మండలంలోని తిలారు సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దుబ్బ వెంకటరమణారావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రోణంకి మల్లయ్య, సర్పంచ్ తర్ర ప్రమీల, గొద్దు హేమలత, ఎంపీటీసీ తర్ర అప్పలనాయుడు, డీటీ మధు తదితరులు పాల్గొన్నారు.



నందిగాం: ధ్రువపత్రాలతో లబ్ధిదారులు

టెక్కలి: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా టెక్కలి మండలంలో 16,457 వివిధ రకాల ధ్రువపత్రాలను లబ్ధిదారులకు ఉచితంగా అందజేసినట్లు జగనన్న గ్రామ సచివాలయాల మండల ఇన్‌చార్జి శిగిలిపల్లి మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇందులో భాగంగా అత్యధికంగా రెవెన్యూ శాఖ నుంచి 15,827 ధ్రువపత్రాలు అందజేసినట్లు పేర్కొన్నారు. అలాగే సంక్షేమ పథకాలపై సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపడంతో లబ్ధిదారులంతా ఆనందం వ్యక్తం చేశారన్నారు.

వజ్రపుకొత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమం పేద ప్రజలకు వరమని మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రం వజ్రపుకొత్తూరులో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పుక్కళ్ల గురయ్యనాయుడు, సీనియర్ నాయకుడు బమ్మిడి మోహన్‌రావు, కిడిసింగి సర్పంచ్ నర్తు లక్ష్మీనారాయణ, ఇరోతు హేమంత్, విఘ్నేష్, తహసీల్దార్ బి.అప్పలస్వామి, ఈవోపీఆర్డీ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: ఎన్నికల సమయాల్లో చంద్రబాబు నాయుడు అబద్ధాల రాజకీయం చేస్తాడని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రెయ్యిపాడు గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో పొరపాటున టీడీపీ గెలిస్తే రాష్ట్రం మరో 20 ఏళ్ల వెనుకకు వెళ్తుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశవరావు, క్లస్టర్ ఇన్‌చార్జి మద్దిలి హరినారాయణ, ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మ, ఉప తహసీల్దార్ వి.గిరిరాజ్, ఏఎంసీ డైరెక్టర్ మద్దిల ధనలక్ష్మి, మద్దిల తిరుపతిరావు, పీజేపురం సర్పంచ్ బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సోంపేట: మండలంలోని బారువ మేజర్ పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, జెడ్పీటీసీ తడక యశోద, సర్పంచ్ యర్ర రజనీ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

సోంపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని బారువ మేజర్ పంచాయతీలో రూ.40 లక్షల నిధులతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.21.8 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్సీ నర్తు రామారావుతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా సచివాలయ వ్యవస్థను తీసుకు రావడం జరిగిందన్నారు. ఇంటి వద్దకే సేవలు అందజేస్తూ, ప్రజా సమస్యలు గ్రామాల్లోనే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థను కించపరిచే వ్యక్తులకు ప్రజలే బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, జెడ్పీటీసీ తడక యశోద, బారువ సర్పంచ్ యర్ర రజనీ, వైస్ ఎంపీపీ గురాల శ్రీను, మండల కమిటీ అధ్యక్షుడు తడక జోగారావు, జేసీఎస్ కన్వీనర్ బుద్దాన శ్రీకృష్ణ, ఎంపీటీసీలు టి.సునీత, ఎం.సునీత, పంచాయతీ రాజ్ డీఈ సూర్యప్రకాష్, ఏఈ రమేష్, ఎంపీడీవో బెందాళం వెంకటరమణ, తహసీల్దార్ సత్యనారాయణ, పార్టీ నాయకులు భువనేశ్వర్ పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు

మారుమూల గ్రామాలకూ నవరత్నాలు

- దువ్వాడ వాణి
- చిన్నకేదారిలో గడప గడపకూ మన ప్రభుత్వం

టెక్కలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మారుమూల గిరిజన గ్రామాలకు సైతం నవరత్నాల సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. మండలంలోని ముఖలింగాపురం పంచాయతీ పరిధి చిన్నకేదారి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో గిరిజన గ్రామాలకు సంక్షేమ పథకాలు అందాలంటే అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు అన్ని ప్రాంతాల్లో గ్రామ వలంటీర్లతో సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా మండలంలో సుమారు 595 మంది గిరిజనులకు పోడు వ్యవసాయం పట్టాలు అందజేశారని గుర్తు చేశారు. అనంతరం ప్రతీ గడపకూ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందజేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ అట్ల సరోజనమ్మ, సర్పంచ్ బందపల్లి రాకేష్, ఎంపీడీవో రమణమూర్తి, సర్పంచ్‌లు ఆర్.జయమోహన్, జి.మోహన్‌రెడ్డి, ఎం.శంకర్, కె.కామేష్, నాయకులు జి.అప్పలరెడ్డి, పి.శ్రీనివాస్, డి.లోకేష్, ఆర్.మురళీరెడ్డి, టి.లోకేష్, రాజేష్, దువ్వాడ హైందవి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



గిరిజనులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న దువ్వాడ వాణి

'కాంపాక్ట్ బ్లాక్'పై రైతులకు అవగాహన

కంచిలి: ప్రకృతి వ్యవసాయంలో 'కాంపాక్ట్ బ్లాక్' పద్ధతిపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని మండలంలోని గోకర్ణపురం యూనిట్ బూరగాం గ్రామ ఆర్‌బీకే పరిధిలో మండల యాంకర్ టి.శివానందం గురువారం చేపట్టారు. కాంపాక్ట్ బ్లాక్ అంటే విత్తనం నాటిన నుంచి మరలా విత్తనం వచ్చేవరకు అన్ని ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించే విధంగా రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమంగా పేర్కొన్నారు. పీజీఎస్ సర్టిఫికెట్ కోసం, మార్కెటింగ్ కోసం ఒక రైతు భరోసా కేంద్రం పరిధిలో 5 నుంచి 10 మంది రైతులు ఒక సంఘంగా ఏర్పడాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత మద్దు వెంకటరావు, మండల యాంకర్ ఎస్.కుమారి, వీఏఏ లక్ష్మి, ఐసీఆర్పీలు కె.ప్రమీల, జి.ఢిల్లేశ్వరి, కె.తేజావతి తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

జీడి పంటకు మద్దతు ధర కల్పించాలి

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దాన రైతులు కష్టపడి పండించిన జీడి పంటకు మద్దతు ధర కల్పించాలని ఏపీ జీడి రైతుల సంఘ జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కోరారు. ఈ మేరకు మండలంలోని బైపల్లి, అక్కుపల్లి, గుణుపల్లి, మోట్టూరు తదితర గ్రామాల్లో గురువారం పర్యటించి ప్రచారం చేపట్టారు. జీడి పంటకు మద్దతు ధర కల్పించాలని కోరుతూ కాశీబుగ్గలోని గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం నిర్వహించనున్న సత్యాగ్రహం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జీడి రైతు సంఘ నాయకులు తమ్మినాన శాంతారావు, కె.బాలాజీ, సాతుపల్లి కాంతారావు, లక్ష్మీనారాయణ, డి.చంద్రశేఖర్, సత్యం, దున్న కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



వజ్రపుకొత్తూరు రూరల్: ప్రచారం చేస్తున్న జీడి రైతు సంఘ నాయకులు

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

- పిరియా సాయిరాజ్
- సోంపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం

సోంపేట: రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. సోంపేట సచివాలయం–1 పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన అందిస్తున్నారని తెలియజేశారు. అనునిత్యం ప్రజలకు మేలు చేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వర్ రెడ్డి, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, సోంపేట సర్పంచ్ నగిరి ప్రభావతి, ఉప సర్పంచ్ ఎం.వెంకటరమణ, సుంకిడి సర్పంచ్ ఎస్.భాస్కరరావు, ఎంపీటీసీలు పొడుగు కామేష్, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న పిరియా సాయిరాజ్

పారాలీగల్ వాలంటీర్ల నియామకానికి దరఖాస్తులు

కాశీబుగ్గ: పారాలీగల్ వాలంటీర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల న్యాయసేవాధికారి సంఘం, జూనియర్ సివిల్ జడ్జి డి.శ్రీభరణి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు, విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యులు, సేవా దృక్పథం ఉన్నవారు, మైత్రి సంఘ ప్రతినిధులు, న్యాయ సంబంధిత విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు చెందినవారై ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు కలర్ ఫొటో, విద్యార్హత ధ్రువపత్రాలతో పలాస మండల న్యాయ సేవాధికారి సంఘం (కోర్టు)కు 31వ తేదీలోగా దరఖాస్తు అందించాలన్నారు. ఎంపికైన వారికి ఎటువంటి పారితోషకాలు, జీతభత్యాలు, వేతనాలు ఉండవని, సామాజిక స్పృహతో పనిచేయాలని స్పష్టం చేశారు.

సంక్షిప్తంగా...

రహదారి పనులు చేపట్టాలని వినతి

వజ్రపుకొత్తూరు: మండలంలోని తేరపల్లి–రెయ్యిపాడు బీటీ రహదారి నిర్మాణ పనులను చేపట్టాలని సర్పంచ్ బత్సల ధర్మారావు, వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మద్దిల హరినారాయణ, తిరుపతిరావులు కోరారు. ఈ మేరకు పలాసలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం కలిసి వినతి పత్రం అందించారు. దీంతో పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన



నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

టెక్కలి: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డివిజన్ కేంద్రమైన టెక్కలిలోని డీఈఈ కార్యాలయం ఎదుట విద్యుత్ ఉద్యోగులు గురువారం నిరసన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జేఏసీ పిలుపు మేరకు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. వేతన సవరణ, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సర్వీస్ క్రమబద్ధీకరణ తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఎస్.శ్రీనివాసరావు, ఎన్.లోకేశ్వరరావు, డి.శేఖర్, సురేష్‌కుమార్, గోపాల్, సుదర్శనరావు, ఈశ్వరరావు, కరుణాకర్, శ్యామ్యూల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలాస విద్యుత్ డివిజన్ కార్యాలయం ఎదురుగా విద్యుత్ ఉద్యోగులు గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. జేఏసీ పిలుపు మేరకు ఐకాస దశలవారీగా చేపట్టిన నిరసన ర్యాలీలో ఉద్యోగులు పాల్గొన్నారు. నల్ల బ్యాడ్జీలు పెట్టుకుని విధులకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఈఈ ప్రసాదరావు, డీఈఈ కృష్ణమూర్తి, పలాస, కాశీబుగ్గ, మందస ఏఈలు, ఏవోలు పాల్గొన్నారు.

రొయ్యల చెరువులపై ఫిర్యాదు

టెక్కలి: సంతబొమ్మాళి మండలం గొదలాంలో అక్రమ రొయ్యల చెరువుల వలన పంట పొలాలకు ముంపు ప్రమాదం ఏర్పడిందని మేఘవరం ఎంపీటీసీ సూరాడ రాజారావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు శిమ్మ సోమేశ్వరరావులు టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డికి గురువారం ఫిర్యాదు చేశారు. రొయ్యల చెరువుల వలన మేఘవరం, కొల్లిపాడు, బోరుభద్ర, వడ్డివాడ, కాకరాపల్లి, హెచ్ ఎన్.పేట, కోటపాడు తదితర పంచాయతీల్లో పంట పొలాలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. తక్షణమే అక్రమ రొయ్యల చెరువులను తొలగించాలని విన్నవించారు.

ఉపాధ్యాయునికి సన్మానం

మందస: మండలంలోని రాంపురం పంచాయతీ బిడిమి గ్రామంలో 13 సంవత్సరాలుగా ఉపాధ్యాయుడిగా పనిచేసిన వై.తేజేశ్వరరావును గ్రామస్తులు గురువారం సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ పొట్టి ధర్మారావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దున్న హరికృష్ణ, ఉపాధ్యాయుడు సార భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు మార్గ నిర్దేశకులు

వజ్రపుకొత్తూరు: ఉపాధ్యాయులు సమాజ మార్గ నిర్దేశకులని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గోవిందపురం ఉన్నత పాఠశాల లో పనిచేస్తూ పదోన్నతి, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలిన రమ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పి.చిరంజీవి, గ్రామ పార్టీ అధ్యక్షుడు పాలిన ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు సీహెచ్ ఉమారావు, ఢిల్లేశ్వరరావు, రషీద్, ధర్మా రావు, నాగరాజు, సీఆర్‌పీ ఎ.కృష్ణారావు, పార్థసారధి, జయలక్ష్మి పాల్గొన్నారు.

220 మందికి ఉచిత వైద్య సేవలు

టెక్కలి: అఖిల భారత యాదవ సంఘం (అహిర్) రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు గురునాథ్ యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక అయ్యప్పనగర్‌లో జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా 220 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గురునాథ్ యాదవ్ జన్మదినం సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరానికి, రక్తదాన శిబిరానికి స్థానికంగా మంచి స్పందన లభించింది.

కలాం సేవలు మరువలేనివి



కవిటి: కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చిన్నారులు

కవిటి: అణు శాస్త్రవేత్తగా, భారత రాష్ట్రపతిగా దేశానికి అబ్దుల్ కలాం చేసిన సేవలు మరువలేనివని పెద్ద ఎర్రగోవిందపురం హెచ్‌ఎం బెజ్జిపల్లి దేవదాస్ అన్నారు. పాఠశాలలో గురువారం కలాం వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

నిష్పక్షపాతంగా ఓటర్ల సర్వే



సర్వే పరిశీలిస్తున్న ఈఆర్వో సుమబాల

కంచిలి: ఇంటింటా ఓటర్ల సర్వే ప్రక్రియను బీఎల్‌వోలు నిష్పక్షపాతంగా చేపట్టాలని ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎం.సుమబాల పేర్కొన్నారు. మండలంలో చేపడుతున్న ఓటర్ల నమోదు ప్రక్రియను గురువారం పరిశీలించారు. గడువులోగా డోర్ టూ డోర్ సర్వే పూర్తి చేయాలని, అవసరమైన సమాచారం ముందుగా ప్రజాప్రతినిధులకు, గ్రామ పెద్దలకు అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆమెతోపాటు ఎలక్షన్ డీటీ బి.శ్రీహరి, తహసీల్దార్ ఎస్.హైమావతి, ఎంఆర్ఐ ఎ.అపర్ణ, సీనియర్ అసిస్టెంట్ ఎస్.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తక్షణ సాయం అందజేత

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలోని 15వ వార్డు పండా కాల నీకి చెందిన గనగళ్ల లక్ష్మి (49) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆమె కుటుంబానికి మంజూరైన వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలును గురువారం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, వార్డు కౌన్సిలర్ పిలక ఈశ్వరి, వైఎస్సా ర్‌సీపీ నాయకులు పిలక విజయ్‌భాస్కర్‌రెడ్డి, నీలాపు డిల్లీ పాల్గొన్నారు.

పనులు పరిశీలన

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ ప్రధాన కేటీ రోడ్డును కలుపుకునే డిగ్రీ కళాశాల రోడ్డు కల్వర్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పనులను మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో జరుగుతున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, త్వరితగతిన పనులు జరిగే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. పూర్తి స్థాయిలో పనులు జరిగితే జంట పట్టణాలు సుందరంగా కనిపిస్తాయని పేర్కొన్నారు.